క్లుప్తంగా

బోధన పద్ధతులను మెరుగుపర్చుకోవాలి



ధర్పల్లిలో మాట్లాడుతున్న ఎంఈవో రమేశ్

ధర్పల్లి: ఉపాధ్యాయులు బోధన పద్ధతులను మెరుగుపర్చుకోవాలని ఎంఈవో రమేశ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు పర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. సరైన బోధన పరికరాలను వినియోగించి బోధనాభ్యాసన ప్రక్రియలు జరపాలని అన్నారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు అంకం నరేశ్, వెంకట రాజారెడ్డి, సతీశ్, మైత్రి గంగాధర్, శ్రీనివాస్, ప్రసన్న, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జిని కలిసిన జిల్లా నాయకులు



విశ్వనాథన్‌తో శేఖర్ గౌడ్, సయ్యద్ ఖైసర్

సుభాష్‌నగర్: కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్‌ను బుధవారం ఆ పార్టీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, పేదలంతా సంతోషంగా ఉన్నారని ఆయనకు వివరించారు. క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని, పని చేసిన వారికి పదవులు వరిస్తాయని విశ్వనాథన్ సూచించారు. విశ్వనాథన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఖైసర్, నగర ప్రధానకార్యదర్శి నరేందర్ సింగ్ తదితరులు ఉన్నారు.

భూమి కబ్జాపై వాస్తవాలను తేల్చాలి

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి శివారులో ఉన్న ఊడల పెద్దమర్రి భూమి వద్ద ఉన్న దేవుని మాన్యం భూమిని కొందరు కబ్జా చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాకు గురైన 21 గుంటల దేవుని మాన్యం భూమిని కబ్జా కాకుండా చూడాలని, ఈ భూమిపై సర్వే చేసి వాస్తవాలను తేల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దేవుని మాన్యం భూమిపై కబ్జాదారులు పట్టాపాస్ పుస్తకం పొందారని, దీనిని వెంటనే రద్దుచేసి స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: నగరంలో అర్హులైన పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు మహ్మద్ అక్బర్ నవాజుద్దీన్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బల్దియా కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అక్బర్ నవాజుద్దీన్ మాట్లాడుతూ.. నగరంలోని 13వ డివిజన్‌లో అర్హులైన పేదలు చాలా మంది ఉన్నారని, కానీ కొందరిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని తెలిపారు. స్థానిక నాయకుల ఒత్తిడి మేరకు అర్హులు కానివారికి, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని ఫిర్యాదు చేశారు. అసలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు. ఈ నెల 21 వరకు మెదక్ జిల్లాలోని తూప్రాన్‌లో నిర్వహించిన 11వ రాష్ట్ర జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించి బంగారు పతకం సాధించిన క్రీడాకారులు రాజు, నాగసూర్య, విఘ్నేశ్‌లను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో పీడీ గంగామోహన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగాజమున, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఒత్తిళ్లలో బల్దియా ఉద్యోగులు

- సెలవు రోజుల్లోనూ విధులు
- అత్యవసరమైనా సెలవు నిరాకరణ
- మూడు నెలల నుంచి తీవ్ర పని ఒత్తిడి
- ఇబ్బంది పడుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది



బల్దియా కార్యాలయం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో చిరు ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడితో చితికిపోతున్నారు. నెలల తరబడి సెలవు లేకుండా విధులు నిర్వహిస్తున్నా అత్యవసర సమయాల్లో సైతం సెలవు ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. గత మూడు నెలల నుంచి తీవ్రమైన పని ఒత్తిడి వారిపై పెరుగుతోంది. ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటలైనా అధికారులు సిబ్బందిని ఇంటికి పంపడం లేదు. చివరకు మహిళలకు సైతం ఈ పని ఒత్తిడి తప్పడం లేదు. రూ. లక్షల్లో వేతనాలు తీసుకుంటున్నవారు మాత్రం ఠంచనుగా సాయంత్రం 5 కాగానే గేటు దాటుతున్నారు. కానీ చాలీ చాలని వేతలనాలతో పనులు చేస్తున్నవారితో మాత్రం రాత్రివరకు పనులు చేయించుకుంటున్నారు.

కొనసాగుతున్న సంక్షేమ పథకాలు

కుటుంబ సర్వే, కుల గణన సర్వేతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పలు పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బల్దియా ఉద్యోగులను ఇందులో భాగస్వామ్యం చేశారు. మార్చి 31 వరకు పన్నుల వసూళ్లలోనూ వీరి సేవలు వినియోగించుకున్నారు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రాజీవ్ యువ వికాసం రుణాల కోసం క్షేత్ర స్థాయిలో సర్వే చేశారు. దరఖాస్తులను సేకరించడం, వివరాలు సరిచూసుకోవడం, ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయడం వంటి పనుల్లో బల్దియా సిబ్బంది, ఉద్యోగులు నిమగ్నమయ్యారు.

నో టైమింగ్..

బల్దియా ఉద్యోగుల్లో కొందరికి మాత్రం టైమింగ్ లేదు. ముఖ్యంగా పెన్షన్ విభాగంలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, సహాయకులకు మాత్రం ఖచ్చితమైన సమయం లేదు. ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు కూడా పనులు చేయిస్తున్నారు. ఇందులో మహిళలు, గృహిణులు, యువతులతో పాటు కొందరు యువకులు కూడా ఉన్నారు. బల్దియాలోని దరఖాస్తు ఫారాలన్నీ వీరితోనే చేయిస్తున్నారు. పెన్షన్ విభాగంతో పాటు రెవెన్యూ, ఇతర విభాగాల్లో పనులు చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవులు ఇవ్వడం లేదు. పండుగ రోజుల్లో సైతం డ్యూటీలు వేస్తున్నారు. ఇంత పనులు చేస్తున్నా సెలవు కావాలంటే మాత్రం సెలవు ఇవ్వడం లేదంటు ఉద్యోగులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరికే డ్యూటీలు వేస్తూ పక్షపాతం వహిస్తున్నారని కొందరు ఉద్యోగులు మండిపడుతున్నారు. ప్రశ్నించినవారిని టార్గెట్ చేస్తున్నారని వాపోతున్నారు.

పని ఒత్తిడి పెరిగింది

కార్పొరేషన్‌లో మూడు నెలలుగా పని ఒత్తిడి బాగా పెరిగింది. ఫిబ్రవరి నుంచి సెలవులు ఇవ్వడం లేదు. ఆఫీసు సమయపాలన లేనేలేదు. రాత్రి అయినాసరే పని పూర్తి చేసి వెళ్లాలని ఆదేశిస్తున్నారు. ఇంట్లో సమస్యలు వస్తున్నాయి. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ఉన్నతాధికారులు మా పరిస్థితిని అర్థం చేసుకోవాలి.
– మృణాళిని, కాంట్రాక్టు ఉద్యోగి

కమిషనర్ ఆదేశాల మేరకు..

మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బందితో పనులు చేయిస్తున్నాం. సంక్షేమ పథకాలు వరుసగా వస్తున్నాయి. ప్రస్తుతం రాజీవ్‌యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల రీసర్వే, కంప్యూటరీకరణ సాగుతోంది.ఉన్న సిబ్బందితోనే పనులు చేయించుకోవాల్సి వస్తోంది. కిందిస్థాయి సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిన మాట వాస్తవం.
– చిదుర రమేశ్, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్

వేల సంఖ్యలో దరఖాస్తులు..

రాజీవ్ యువ వికాసం కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులు పూర్తిసమాచారం ఇవ్వలేదు. దీంతో ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నాం. కిందిస్థాయి సిబ్బంది చాలా కష్టపడి పనులు చేస్తున్నారు. సమయం దాటినా, వారితో పనులు చేయించక తప్పడం లేదు.
– పడాల గోవర్ధన్ గౌడ్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, పెన్షన్ విభాగం

ఎందుకు చేయాలని ప్రశ్నిస్తున్నారు

కమిషనర్ ఆదేశాలతోనే అందరికీ సమానంగా డ్యూటీలు వేస్తున్నాం. కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది మా డ్యూటీ కాదు ఎందుకు చేయాలని ప్రశ్నిస్తున్నారు. నేనేమీ చేయలేను. కమిషనర్ ఆదేశాల మేరకు డ్యూటీలు వేస్తున్నాం.
– ఇర్ఫాన్, కమిషనర్ సీసీ

కాంట్రాక్టు ఉద్యోగులతో వెట్టిచాకిరి..

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో బల్దియా అధికారులు వెట్టిచాకిరి చేయిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా పనులు చేయించుకోవడం చట్టవిరుద్ధం. అదనపు పనులు చేయిస్తే వారికి తగిన అదనపు వేతనం ఇవ్వాలి.
– దండి వెంకట్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

డిచ్‌పల్లి: రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని డిచ్‌పల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో శాస్త్రవేత్త రమ్యా రాథోడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్ జయ్ ప్రకాశ్ రైతులకు పలు అంశాలపై సూచనలు చేశారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, తక్కువ యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. పంట మార్పిడి పాటించడం ద్వారా నేల సారాన్ని మెరుగుపర్చడంతో పాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. పప్పుదినుసులు, నూనె గింజల వంటి పంటలను పంట సరళిలో చేర్చితే భవిష్యత్‌లో అధిక దిగుబడి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆశ్రిత రాజ్, రూపేష్ కుమార్, సతీశ్, రైతులు పాల్గొన్నారు.

మోపాల్‌లో వర్ష బీభత్సం

- 47.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- ఈదురుగాలులకు నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు

మోపాల్: మండలంలో బుధవారం తెల్లవారు జామున కురిసిన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. 47.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బలమైన ఈదురుగాలులు వీయడంతో చిన్నాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. అలాగే ముదక్‌పల్లి, నర్సింగ్‌పల్లిలో విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను ఏఈ నాగశర్వాణి, లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, మహిపాల్ పరిశీలించారు. విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నారు. భారీ వర్షానికి వ్యవసాయ మడుల్లో నీరు నిలిచాయి. వర్షంతో వేసవి దుక్కులు, జీలుగ విత్తనాలు విత్తుకోవచ్చని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



చిన్నాపూర్‌లో నేల కూలిన ట్రాన్స్‌ఫార్మర్



ముదక్‌పల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే



రక్తదానం చేస్తున్న నాయకులు

నిజామాబాద్ రూరల్: మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వినాయక్‌నగర్‌లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ ప్రజల కోసం ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అమృతపూర్ గంగాధర్, ఉమ్మాజీ నరేశ్, వాసు బాబు, ధర్మ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ దేశ ప్రధాని రాజీవ్‌గాంధీ మహోన్నత దార్శనికుడు అని విపుల్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు అనుపాల్ కిరణ్, ఆదిత్య పాటిల్, నరేందర్ గౌడ్, రషీద్, మహేందర్, సృజన్, నయీం, అక్రమ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

ఖలీల్‌వాడి: బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని నార్త్ సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్ సూచించారు. నగరంలోని ఐదో టౌన్ పీఎస్‌లో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. హిందూ ముస్లింలు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఉండే పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్రం

నిజామాబాద్‌నాగారం: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ వారి వెన్ను విరుస్తోందని ఏఐఎస్‌కేఎస్ జాతీయ ప్రధానకార్యదర్శి కన్వాల్ సింగ్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఏఐఎస్‌కేఎస్ రాష్ట్ర మహాసభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రం రైతులకు సరైన గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతు ఆత్మహత్యలకు పాల్పడేలా చేస్తోందని మండిపడ్డారు. రైతులు సంఘటితమై కిసాన్ మార్చ్ చేసే విధంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అవాజ్‌సింగ్, జానకిరాములు, శివాజీ, యార్లగడ్డ సాయిబాబా, మోహన్, విజయలక్ష్మి, రాధిక, లక్ష్మి, పోసాని, లింగమ్మ, అనిత, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిహిల్స్ లో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరవ టౌన్ పీఎస్ పరిధిలోని ధర్మపురి హిల్స్ లో చోరీ జరిగినట్లు ఎస్సై వెంకట్రావు బుధవారం తెలిపారు. కాలనీకి చెందిన మహ్మద్ హమీద్ మంగళవారం ఇంటికి తాళం బంధువుల వివాహానికి వెళ్లాడు. విషయం గమనించిన దుండగులు అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న కొంత నగదు, బంగారు రింగులు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమ్మ వెంచర్‌లో ఈ నెల 18న ఉదయం ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ స్కూటీని గుర్తు తెలియని బైక్ ఢీకొట్టినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. విధులు ముగించుకొని అమ్మ వెంచర్‌లో ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం

నిజామాబాద్ సిటీ: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న గంగాధర్‌ను కమిషనర్ దిలీప్‌కుమార్ బుధవారం సన్మానించారు. బదిలీపై ఆర్మూర్‌కు వెళ్తున్న గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ మురళీమోహన్ రెడ్డి, డీఈలు సుదర్శన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సుభాష్‌నగర్: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకున్న 65 మందికి సీఎం సహాయనిధి ద్వారా రూ.27,51,200 విలువైన చెక్కులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, పవన్ ముందాడ, చింతకాయల రాజేందర్, ఇప్పకాయల కిశోర్, చావూస్ ఖైజర్, బీజేపీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హేమంత్‌కు దళిత రత్న అవార్డు ప్రదానం



అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ: మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి హేమంత్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆయన చేసిన సేవలకు దళిత రత్న అవార్డును ప్రకటించింది. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామానికి చెందిన హేమంత్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ లకు ఎంతో సేవా కార్యక్రమాలు చేసేవాడని, ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అవార్డును ప్రకటించినట్లు మాల మహానాడు రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. ఈ అవార్డును బుధవారం రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి చేతుల మీదుగా హేమంత్ అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల మాల మహానాడు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి మోహన్, డీసీసీ అధ్యక్షుడు వెల్మ భాస్కర్ రెడ్డి, పోచయ్య, గంగాధర్, రాకేశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి



ముదక్‌పల్లి గ్రామస్తులతో ముప్ప గంగారెడ్డి

మోపాల్: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. బుధవారం మోపాల్ మండలంలోని ముదక్‌పల్లి, కాస్‌బాగ్ తండా, శ్రీరాంనగర్ తండా, గుడి తండాల్లో ఎంపీడీవో రాములు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లలో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నరలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తోందని అన్నారు. రుణమాఫీ, రైతుభరోసా, రూ.500 బోనస్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ. పది లక్షలకు పెంపు, ఇతర అనేక పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇల్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు, హౌసింగ్ ఏఈ, గ్రామస్తులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న నగేశ్‌రెడ్డి

డిచ్‌పల్లి: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసి ఇస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్ రెడ్డి అన్నారు. బుధవారం డిచ్‌పల్లి మండలం ముల్లంగిలో 40 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. లబ్ధిదారుని ఇంటికి భూమిపూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సూచనల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సయ్య, సొసైటీ చైర్మన్ గ్యానజి గంగారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గంగారెడ్డి, నాయకులు శ్రీనివాస్, మధు, జీపీ కార్యదర్శి గంగాధర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



అర్గుల్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు

జక్రాన్‌పల్లి: అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్‌లో తడిసిన ధాన్యాన్ని డీసీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షంలో తడిసిన ధాన్యాన్ని సొసైటీ తరఫున కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఆయన వెంట అర్గుల్ సొసైటీ సీఈవో తిరుపతిరెడ్డి, రైతులు ఉన్నారు.

హబీబ్‌నగర్‌లో యువకుడిపై కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని హబీబ్‌నగర్‌లో ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. హబీబ్‌నగర్‌కు చెందిన షేక్ షహబాత్, తన చిన్న తమ్ముడు షేక్ అబ్రార్ అదే కాలనీలోని ఓ కిరాణా దుకాణం ఎదుట మంగళవారం సాయంత్రం నిలబడి ఉండగా కొందరు హేళన చేస్తూ వెళ్లారు. దీంతో షహబాత్ వారిని తీవ్రంగా బెదిరించాడు. దీనిని దృష్టిలో పెట్టుకున్న వారు అదే రోజు రాత్రి 10 గంటల ప్రాంతంలో షహబాత్ ఇంటికి చేరుకొని అబ్రార్‌ను, మరో తమ్ముడు షహజాజ్‌పై సైతం దాడి చేశారు. విషయం తెలుసుకున్న షహబాత్ అక్కడికి రావడంతో అతనిపై కూడా దాడి చేశారు. ఇందులో హర్షత్ అనే వ్యక్తి షహబాత్ ఛాతిపై కత్తితో తీవ్రంగా గాయపర్చాడు. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	95,700	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	88,337		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	150	200	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	25	50
పాలకూర	25	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	60	80
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	40	60

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 సింగిల్-1.30, 7.30 యమదొంగ-4.10, 10.30
స్క్రీన్-2 సింగిల్ 11.00,4.30,10.30
హిట్-1.30, 7.20
స్క్రీన్-3 మిషన్ ఇంపాజిబుల్-10.20,4.30, 7.30
మిషన్ ఇంపాజిబుల్(ఇంగ్లీష్ 2డీ)-1.30, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 మిషన్ ఇంపాజిబుల్-10.10, 4.25, 10.40 సింగిల్ -1.40, 7.55
స్క్రీన్-2 డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవెల్- 11.15, 10.50 - లవ్‌లీ-(3డీ)-2.05 సింగిల్-4.35
మిషన్ ఇంపాజిబుల్ -7.20
స్క్రీన్-3 లెవన్ -11.40
యమదొంగ-1.35 - శుభం- 8.05
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(ఇంగ్లీష్)-10.45
స్క్రీన్-4 ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ - 11.20, 1.50, 7.35 హిట్ -4.20, 10.05

లలితామహల్ యమదొంగ **దేవి** సింగిల్
నటరాజ్ మిషన్ ఇంపాజిబుల్
విజయ్ హిట్